## క్లుప్తంగా

### రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి



ఠాగూర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

కొత్తపల్లి: స్థానిక గ్రంథాలయంలో లైబ్రేరియన్ కౌసల్య విద్యార్థులతో కలిసి రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతిని ఆదివారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రవీంద్రనాథ్ ఠాగూర్ జాతీయ గీతాన్ని రచించారని గుర్తు చేశారు. గీతాంజలి కావ్యానికి సాహిత్యం విభాగంలో నోబెల్ బహుమతి లభించిందని చెప్పారు. అలాగే బాలల హృదయాలను వికసింప జేయడానికై ప్రాచీన గురుకులాల తరహాలో శాంతినికేతన్‌గా ప్రసిద్ధి గాంచిన విశ్వభారతి విశ్వ విద్యాలయాన్ని స్థాపించారని కొనియాడారు. అంతకు ముందు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

### వాసవీమాతకు విశేష పూజలు



పూజల్లో పాల్గొన్న శివయోగీంద్ర సరస్వతి

నందికొట్కూరు: స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆదివారం అమ్మవారికి విశేష అభిషేకం, యాగశాల ప్రవేశం, చండీ హోమం నిర్వహించారు. సంప్రోక్షణ కార్యక్రమాలకు అంకురార్పణ చేశారు. దుర్గా పీఠాధిపతులు భాస్కరస్వామి వారి ఆధ్వర్యంలో శివ యోగీంద్ర సరస్వతి స్వామి ఆశీర్వాదం భక్తులు పొందారు. హోమంలో పట్టణ ఆర్యవైశ్యులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకులు ధనుంజయ శర్మ, ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు వీరబొమ్మ నాగసత్యనారాయణ, పట్టణ ప్రధాన కార్యదర్శి నాగేశ్వరరావు, కోశాధికారి జయరామకృష్ణ, యువజన సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులు, కార్యదర్శి కృష్ణమూర్తి పాల్గొన్నారు.

### ఆలయ అభివృద్ధికి కృషి చేయాలి



ప్రమాణస్వీకారం చేస్తున్న దృశ్యం

మహానంది: ఆలయాల ధర్మకర్తగా పనిచేసే అవకాశం రావడం ఎంతో అదృష్టమని, ఆలయాభివృద్ధికి ధర్మకర్తలు కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ శ్రీశైలం నియోజకవర్గ సమన్వయకర్త శిల్పా భువనేశ్వరరెడ్డి, మహానంది ట్రస్ట్ బోర్డు చైర్మన్ కొమ్మా పాలమహేశ్వరరెడ్డి సూచించారు. బుక్కాపురం శ్రీ చెన్నకేశవ స్వామి దేవస్థానం చైర్మన్‌గా మారెడ్డి శ్రీనివాసులు, ధర్మకర్తలుగా రామమూర్తి శర్మ, వల్లూరి రమణారెడ్డి, మంగలి వెంకటరమణ, కుంచపు రమణమ్మ, పులిమద్ది లక్ష్మీదేవి, నాగపూరి జ్యోతి, ఎరుకల వెంకటలక్ష్మి ఆదివారం ప్రమాణస్వీకారం చేశారు. వారితో గ్రూపు ఆలయాల ఈఓ స్వర్ణముఖి, ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షురాలు కుంచపు లక్ష్మీ నరసమ్మ, సర్పంచ్ కందుల వరలక్ష్మమ్మ, జెడ్పీటీసీ కేవీఆర్ మహేశ్వరరెడ్డి, నాయకులు శరభారెడ్డి, కందుల వెంకటసుబ్బారెడ్డి, సర్పంచ్ సుదర్శనం, కందుల రఘురామిరెడ్డి, కుంచపు శ్రీనివాసులు పాల్గొన్నారు.


### మోస్తరు వర్షం



కొత్తపల్లిలో వర్షం కురుస్తున్న దృశ్యం

కొత్తపల్లి: మండలంలోని కపిలేశ్వరం, ఎర్రమఠం, ముసలిమడుగు, గుమ్మడాపురం, శివపురం, లింగాపురం, నాగంపల్లి, కొక్కెరంచ, దుద్యాల, నందికుంట, వీరాపురం, గువ్వలకుంట్ల గ్రామాలతో పాటుగా మండల కేంద్రంలో ఆదివారం మోస్తరు వర్షం కురిసింది. వర్షానికి ఈదురుగాలులు తోడుకావడంతో రెండు గంటల సేపు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

### మద్యం స్వాధీనం



మద్యం బాటిళ్లు, నిందితుల అరెస్టు చూపుతున్న రూరల్ సీఐ సుధాకర్‌రెడ్డి

నందికొట్కూరు: తెలంగాణ మద్యం వ్యాపారం చేస్తే చట్ట పరమైన చర్యలు తప్పవని రూరల్ సీఐ సుధాకర్‌రెడ్డి హెచ్చరించారు. ఆదివారం మండలంలోని బ్రాహ్మణకొట్కూరు పోలీసు స్టేషన్ పరిధిలోని వడ్డేమాన్ గ్రామ సమీపంలో వాహనాల తనిఖీ చేపట్టారు. తెలంగాణ నుంచి మోటారు సైకిల్‌పై నుంచి 100 బాటిళ్ల మద్యం తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నారు. వడ్డేమాన్ గ్రామానికి చెందిన అలీ, నంది కొట్కూరుకు చెందిన కాశిం, బ్రాహ్మణకొట్కూరుకు చెందిన నవీన్‌రెడ్డి అరెస్ట్ చేశారు. ఎస్‌ఐ ఓబులేసు, పోలీసులు పాల్గొన్నారు.

# ‘పది’లో మెరిసిన విద్యా కుసుమాలు





కే. లక్ష్మీదేవి    జి: కే. అనిత    మధులత





దినేష్‌నాయక్ (562)    ఆరీఫ్ (546)    ఇమ్రాన్ (540)





సిరివెన్నెల (559)    టేకూరి రాము (558)    శిరీష (554)





సృజన (570)    టి.ధరణి (552)    కుశల యాదవ్ (551)

పగిద్యాల: శనివారం వెలువడిన పదవ తరగతి పరీక్షా ఫలితాలలో బాలికలే మండల టాపర్లుగా ఉత్తీర్ణత సాధించారు. గత నెల 4వ తేది నుంచి ప్రారంభమైన పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు 417 మంది (తెలుగు, ఇంగ్లీష్ మీడియం) బాల,బాలికలు హజరు కాగా 284 మంది పాసై 68.11 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు మండల విద్యాధికారి సుభాన్ పేర్కొన్నారు. మండల టాపర్లుగా లక్ష్మాపురం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినీలు కే. లక్ష్మీదేవి(537), కే. అనిత(532), ఆదర్శ పాఠశాలకు చెందిన గీతా(532) మార్కులతో ప్రథమ, ద్వితీయ శ్రేణిలో పాసయ్యారు. అలాగే ఎం. మధులత(529) మార్కులు సాధించారు. ఇంకా నెహ్రూనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన కే. కళ్యాణి(511), లక్ష్మీసాయిలహరి(505) మార్కులు సాధించడం పట్ల ఆ పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలో కంటే ఈసారి పదవ తరగతి పరీక్షా ఫలితాలు తొందరగా విడుదల చేశారని ఫెయిల్ అయిన విద్యార్థులకు సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించేందుకు సోమవారం నుంచి ప్రత్యేక క్లాసులు నిర్వహించనున్నట్లు ఎంఈఓ వెల్లడి చేశారు.

పాములపాడు: 10వ తరగతిలో విద్యార్థులు 55.12శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ బాలాజీనాయక్ తెలిపారు. శనివారం వెలువడిన ఫలితాల్లో మండలంలో తెలుగు మీడియం విద్యార్థుల కంటే ఇంగ్లీష్ మీడియం విద్యార్థులే ఫలితాలు మెరుగ్గా వచ్చాయి.



వర్షిత్(579)

తెలుగు మీడియం లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు 127 మంది పరీక్షలకు హాజరుకాగా 35 మంది ఉత్తీర్ణ సాధించారు. కాగా ఇంగ్లీష్ మీడియంలో 133 మంది విద్యార్థులకు గాను 78 మంది ఉత్తీర్ణత సాధించారు.

- జెడ్పీహెచ్ఎస్ వేంపెంట 46 మందికి గాను 24 మంది, జెడ్పీహెచ్ఎస్ పాములపాడు 57 మందికి గాను 14 మంది, జెడ్పీహెచ్ఎస్ లింగాల 29 మందికి గాను 5మంది, జెడ్పీహెచ్ఎస్ వానాల 15 మందికి గాను 4, జెడ్పీహెచ్ఎస్ తుమ్మలూరు 21 మందికి గాను 8 మంది, ఏపీ మోడల్ స్కూలు 92 మందికి గాను 58, కేజీబీవీ 31 మందికి 10 మంది చొప్పున ఉత్తీర్ణత సాధించారు.

**ఆయా పాఠశాలలో టాపర్లు:**
మండల టాపర్‌గా వేంపెంట జెడ్పీహెచ్ స్కూలుకు చెందిన మౌల్యాశ్రీబాయి 580 మార్కులతో టాపర్‌గా నిలిచింది. ఏపీ మోడల్‌స్కూలు విద్యార్థి వర్షిత్ 579 మార్కులు సాధించారు. తుమ్మలూరు రియాజ్ 491 మార్కులు, వానాల నితిన్462 మార్కులు, లింగాల సాయికుమార్ 396 మార్కులు, పాములపాడు 360 మార్కులు సాధించి

**తగ్గిన ఉత్తీర్ణత శాతం..**
జూపాడుబంగ్లా: పదో తరగతి వార్షిక ఫలితాల్లో మండలంలో ఉత్తీర్ణత శాతం భారీగా తగ్గింది. ఎంఈఓ మోహన్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని 8 ఉన్నత పాఠశాలల్లో 437 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా కేవలం 215 మంది పాసై 49 శాతం ఉత్తీర్ణత శాతం నమోదైంది. గురుకుల పాఠశాలలో 72 మందికిగాను 56 మంది ఉత్తీర్ణత సాధించగా పాఠశాలకు చెందిన ఎం.కిరణ్ 526 మార్కులు సాధించాడు. కస్తూర్బాలో 39మందికి 21మంది పాసవగా.. జ్ఞానేశ్వరి 526 మార్కులు సాధించింది. మండ్లెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 30మందికి 11 మంది ఉత్తీర్ణత సాధించగా రేణుక 446 మార్కులు సాధించింది. కనకయ్యకొట్టాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 33 మంది విద్యార్థులకు గాను కేవలం ఆరుగురు పాసవగా కవిత 506మార్కులు సాధించింది. పారుమంచాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 42 మందికి 10 మంది మాత్రమే ఉత్తీర్ణులవగా సుభాషిణి 427 మార్కులు సాధించింది. తరిగోపుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 18 మందికి గాను 9మంది ఉత్తీర్ణత సాధించగా స్వప్న 489 మార్కులు సాధించింది. ఏపీ మోడల్ పాఠశాలలో 96 మందికి 69 మంది పాసవగా దినేషన్‌నాయక్ 562 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచాడు. 546 మార్కులతో ఆరిఫ్ మండలంలో ద్వితీయస్థానంలో నిలవగా, 540 మార్కులతో ఇమ్రాన్ తృతీయస్థానంలో నిలిచారు.



ఎం.వివేకానంద (576)



జీ.దీప్తి (511)

కొత్తపల్లి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఎం.వివేకానంద 576 మార్కులతో మండల టాపర్‌గా నిలిచాడు. అదే పాఠశాలకు చెందిన జీ.దీప్తి 511 మార్కులు సాధించి మండలంలో రెండో స్థానంలో నిలిచింది. మండలంలో మొత్తం 266 మంది విద్యార్థులు పది పరీక్షలు రాయగా 129 మంది ఉత్తీర్ణులై ఉత్తీర్ణత శాతం 40.4గా నమోదైంది.



తబస్సుం (572)



యశశ్విని (567)

నందికొట్కూరు: మండలంలోని బ్రాహ్మణ కొట్కూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని సబ తబస్సుం 572 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచింది. పట్టణంలోని బాలికల పాఠశాలకు చెందిన యశ్విని 567 మార్కులతో మండలంలో రెండో స్థానంలో నిలిచింది. బ్రాహ్మణ కొట్కూరు జెడ్పీ హైస్కూల్‌లో 99 మంది గాను 45 మంది పాసయ్యారు. పట్టణంలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో 131 మంది 77 మంది, కొణిదేల జెడ్పీ హైస్కూల్‌లో 54 మంది గాను 21 మంది పాస్ కాగా కుర్వ దీపిక 525 మార్కులు, మల్యాల జెడ్పీ హైస్కూల్‌లో 16 మంది గాను 10 మంది పాసవగా సరస్వతి 465 మార్కులు, బిజినవేముల జెడ్పీ హైస్కూల్‌లో 25 మంది గాను 16 మంది ఉత్తీర్ణులు కాగా పూజిత 483, వడ్డేమాన్‌లో 48 మంది గాను 42 మంది పాసయ్యారు. వీరిలో బోయ అశ్విని 460 మార్కులు సాధించింది. దామగట్లలో జెడ్పీ హైస్కూల్‌లో 20 మంది గాను ఇద్దరు ఉత్తీర్ణులయ్యారు. ఉర్దూ పాఠశాలలో 35 మందికి 26 మంది పాస్ కాగ దూదేకుల రహ్మత్‌బీకి-549, ప్రభుత్వ హైస్కూల్‌లో 159 మంది గాను 58 మంది పాసయ్యారు. వీరిలో షేక్ మహమ్మద్ ముషార హుసేన్ 538 సాధించాడు. బాలుర కోట హైస్కూల్‌లో 25 మందికి 18 మంది ఉత్తీర్ణులవగా, మొల్ల షబానా 477 మార్కులొచ్చాయి, సీఎస్ఐ ఎయిడెడ్ పాఠశాలలో 35 మంది గాను ఐదుగురు పాసయ్యారు.

శ్రీశైలం: క్షేత్ర పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కె.రఘునాయక్‌కు 498 మార్కులు రాగా, వెంకటనారాయణకు 475 ఉమామహేశ్వరి కి 457 మార్కులు సాధించినట్లు ప్రధానోపాధ్యాయులు బి.మల్లికార్జున శనివారం తెలిపారు. మొత్తం 90 మంది విద్యార్థుల్లో 81 మంది ఉత్తీర్ణులు కావడంతో 90 శాతం ఉత్తీర్ణత శాతం సాధించినట్లైందని, పాఠశాలలో అత్యధిక మార్కులు సాధించిన రఘునాయక్ కు , రెండు, మూడు స్థానాల్లో అధిక మార్కులు పొందిన వారితో పాటు విద్యార్థులందరిని ఉపాధ్యాయులు అభినందించారు.

**పల్లె విద్యార్థుల ప్రతిభ..**
మహానంది: పది ఫలితాల్లో పల్లెవిద్యార్థులు ప్రతిభ చూపారు. గాజులపల్లె జిల్లా పరిషత్ పాఠశాలలో ఎన్. సిరివెన్నెల 559 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచింది. అదే పాఠశాలలో గాజులపల్లెకు చెందిన పఠాన్ ఆసియా 530 మార్కులు సాధించింది. తిమ్మాపురంలోని ఏపీ మోడల్ స్కూల్‌లో చదువుతున్న బుక్కాపురం గ్రామానికి చెందిన టేకూరి రాము 558 మార్కులు సాధించాడు. శిరీష 554, రమ్యదుర్గ 535 మార్కులు పొందినట్లు ప్రిన్సిపాల్ లక్ష్మణరావు తెలిపారు. టేకూరి రాము తండ్రి టేకూరి శ్రీరాములు వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గోపవరం జెడ్పీ పాఠశాల విద్యార్థిని ఆనందజ్యోతి 515 మార్కులు సాధించింది. తిమ్మాపురం జెడ్పీ పాఠశాలలో 45 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 16 మంది, గోపవరం జెడ్పీ పాఠశాలలో 86 మందికి 28 మంది, గాజులపల్లెలో 75 మందికి 27 మంది పాసయి నట్లు ఎంఈఓ రామసుబ్బయ్య తెలిపారు. మండలంలో 45.2శాతం ఉత్తీర్ణత వచ్చినట్లు చెప్పారు.

**సత్తా చాటిన మోడల్ స్కూల్ విద్యార్థులు..**
వెలుగోడు: పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు 78 శాతం ఉత్తీర్ణత సాధించి సత్తా చాటారు. స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో 96 మందికి 75 మంది ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపాల్ నళిని తెలిపారు. అసిపా తరుణం 576 మార్కులు, జియావుల్ రహిమాన్ 552, ఆస్మా బరిన్549 మార్కులు సాధించారు. 500 మార్కులకు పైగా 10 మంది విద్యార్థులు సాధించారు.

- వెలుగోడు జెడ్పీ హైస్కూల్‌లో 214 మందికి 93 మంది పాసై 43.6 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు హెచ్ఎం రూతునల్లి తెలిపారు. బేరి మీనాక్షి 524 మార్కులు(ఇంగ్లీస్ మీడియం), ఖాజాహుసేన్ 509 మార్కులు(ఉర్దూ మీడియం), అఫ్రీన్ 492 మార్కులు(ఉర్దూ మీడియం) సాధించారు.
- వేల్పనూరు జెడ్పీ హైస్కూల్‌లో 80 మందికి 31 మంది పాసవగా 39 శాతం ఉత్తీర్ణత సాధించారు. కంచెర్ల దీపక్ 458 మార్కులు సాధించారు. ఎం .సాజిద్‌బాషా 408 మార్కులు సాధించారు. రేగడగూడురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 50 మంది పరీక్షలు రాయగా 13 మంది పాసవగా తేజ 483 మార్కులు సాధించాడు.

**పడిపోయిన ఉత్తీర్ణత శాతం..**
మిడుతూరు: మండలంలో ఉత్తీర్ణత శాతం (35.66) తగ్గిందని ఎంఈఓ మౌలాలి తెలిపారు. మొత్తం 182 మంది (తెలుగు మీడియం) విద్యార్థులు పరీక్షలు రాయగా 40 మంది, ఆంగ్ల మాధ్యమంలో 192 మందికి 86 మంది, ఉర్దూ మీడియంలో 13 మందికి 12 మంది ఉత్తీర్ణులయ్యారని ఎంఈఓ తెలిపారు. స్థానిక మోడల్ స్కూల్‌లో ఆంగ్ల మాధ్యమంలో 95 మందికి 56 మంది విద్యార్థులు ఉతీర్ణులైనట్లు ప్రిన్సిపాల్ సలీంబాషా తెలిపారు. మండల టాపర్‌గా పి.సాయి సృజన 570 మార్కులు, టి. ధరణి 552, వెల్దుర్తి కుశల యాదవ్ 551, పి. హమీద్ బాషా 548, డి. ఆఫ్రిద్ బాషా 545, డి.భారతి 545 మార్కులు, ఎస్. ఇర్ఫాన్ బాషా 539 , జె. శ్రీవల్లీ 536, కె. లావణ్య 521, ఎస్ సంతోష్ 519, ఎ.హుసేన్ వలి 516, బి.వెంకట వినయ్ 504, కె. రేవంత్ 503 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. పాఠశాలలో 13 మందికి 500 పైగా మార్కులు, 15 మందికి 400 పైగా మార్కులు వచ్చాయని చెప్పారు.

### కబడ్డీ విజేత శకునాల జట్టు

మిడుతూరు: స్థానిక శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా నిర్వహించిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో ఓర్వకల్లు మండలం శకునాల గ్రామానికి చెందిన సీనియర్ జట్టు మొదటి, స్థానంలో నిలిచి రూ.20 వేలు గెలుచుకుందని ఉపసర్పంచ్ తువ్వా లోకేశ్వరరెడ్డి తెలిపారు. అదే గ్రామానికి చెందిన జూనియర్ జట్టు రెండో స్థానంలో నిలిచి రూ.15వేలు, మిడుతూరు జట్టు మూడో స్థానంలో నిలిచి రూ.10 వేలు, కాకనూరు జట్టు నాల్గవ స్థానంలో నిలిచి రూ.5 వేలు, వడ్డెమాను జట్టు ఐదో స్థానంలో నిలిచి రూ.4 వేలు, పారుమంచాల జట్టు ఆరో స్థానంలో నిలిచి రూ. 3 వేలు నగదు బహుమతలను అందుకున్నారు. తువ్వా రామనాగేశ్వరరెడ్డి, నిర్వహకులు బాబు, తిరుపతయ్య పాల్గొన్నారు.

### జైళ్ల శాఖ రాష్ట్ర అదనపు కార్యదర్శిగా జహురుల్లా



నందికొట్కూరు: పట్టణంలోని జైలులో వార్డెన్‌గా పని చేస్తున్న జహురుల్లాను రాష్ట్ర జైళ్ల శాఖ ఉద్యోగ సంఘం అదనపు కార్యదర్శిగా ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జైలు శాఖ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. జైలు శాఖ ఉద్యోగులకు ఎలాంటి సమస్యలు వచ్చిన ముందుండి పోరాడుతానని చెప్పారు. తమకు రాష్ట్ర బాధ్యతలు అప్పగించిన జైలు శాఖ సంఘం రాష్ట్ర అధ్యక్షులు సంబుల విశ్వేశ్వరావుకు కృతజ్ఞతలు తెలిపారు.

**నియామకంపై హర్షం**
కొత్తపల్లి: జైళ్లశాఖ ఉద్యోగుల సంఘం అదనపు కార్యదర్శిగా ముసలిమడుగు గ్రామానికి చెందిన శివపురం జహురుల్లాను నియమించడం హర్షనీయమని మాజీ వైస్ ఎంపీపీ మహబూబ్‌బాషా అన్నారు. ఆదివారం ఆయనను అభినందించారు.

### బెల్లం ఊట ధ్వంసం

మహానంది: మహానంది సమీపంలోని నల్లమల అడవుల్లో నాటుసారా తయారీ కేంద్రాలపై దాడులు చేసి బెల్లం ఊటను ఎస్ఐ జి.నాగేంద్రప్రసాద్, సిబ్బంది ఆదివారం దాడులు చేసి ధ్వంసం చేశారు. స్థానిక ఈశ్వర్‌నగర్ కాలనీకి చెందిన నల్లబోతుల సుధాకర్, నల్లబోతుల ప్రతాప్‌ను అరెస్ట్ చేసి వారి నుంచి ఇరవై లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించినట్లు చెప్పారు. అలాగే క్షేత్రం పరిధిలోని వసతిగృహాలు, ఆరుబయట, పరిసరాల్లో మద్యం సేవిస్తున్న పది మందిపై కేసులు నమోదు చేశారు.

### తైక్వాండో శిక్షణ శిబిరం ప్రారంభం

ఆత్మకూరురూరల్: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలోనున్న ఇన్‌డోర్ స్టేడియంలో మాస్టర్ షబ్బీర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తైక్వాండో వేసవి శిక్షణ శిబిరాన్ని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడలతో చిన్నారుల్లో ఆత్మవిశ్వాశంతో పాటు మానసికోల్లాసం పెంపొందుతుందన్నారు. శాప్ సీఈఓ పివి రమణ,డీఎస్‌డీ ఎంపీఎస్ రాజు, మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియా మారూఫ్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు సయ్యద్ మీర్, నాయకులు పువ్వాడి భాస్కర్, విజయ్ చౌదరి, రషీద్, సుల్తాన్, రహిమాన్,ముఖ్బాల్, కలీముల్లా, స్వామి, వెంకటేశ్వరరెడ్డి, తిమ్మ య్య, దామోదర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

### చెస్ సంఘం జిల్లా చైర్మన్‌గా డాక్టర్ రామకృష్ణారెడ్డి

నంద్యాల(వ్యవసాయం): అఖిల భారత చెస్ ఫెడరేషన్‌లో భాగంగా ఉన్న ఆంధ్రా చెస్ అసోసియేషన్.. నంద్యాల జిల్లా చెస్ సంఘానికి అనుబంధ జిల్లా సంఘంగా ఆంధ్రా చెస్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు కేవీవీ శర్మ, ఎస్.భీమారావు ఆదివారం గుర్తింపు పత్రాలు జారీ చేశారు. జిల్లా చెస్ అసోసియేషన్ చైర్మన్‌గా డాక్టర్ రామకృష్ణారెడ్డి, అధ్యక్షుడిగా డాక్టర్ రవికృష్ణ, కార్యదర్శిగా రామసుబ్బారెడ్డి, కోశాధికారిగా నాగశ్రీనీష్, సుధాకర్, షేక్షావలిరెడ్డి ప్యాట్రన్‌లుగా అసోసియేషన్ ఏర్పడింది. రామకృష్ణారెడ్డి, రవికృష్ణ మాట్లాడుతూ నంద్యాల జిల్లా అసోసియేషన్ ఆంధ్రా చెస్ అసోసియేషన్‌లో భాగంగా పనిచేస్తుందన్నారు. జూన్ 8 నుంచి నాలుగు రోజుల పాటు రాష్ట్రస్థాయి అండర్-19 చెస్ టోర్నమెంట్ నిర్వహిస్తామని చెప్పారు.

# పేదరిక నిర్మూలనే ప్రభుత్వ లక్ష్యం



వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నాయకులు



వృద్ధురాలి సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే శిల్పా

వెలుగోడు: అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందించి పేదరికాన్ని నిర్మూలించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం బండిఆత్మకూరు మండలంలోని ఏ.కోడూరు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎస్సీ కాలనీలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కాలనీలో ఇంటింటికీ తిరిగి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొందరు సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాలని కోరారు. దీంతో వెంటనే పంచాయతీరాజ్ ఏఈ వెంకటయ్యను పిలిచి ప్రతిపాదనలు తయారు చేయించాలని సూచించారు. విద్యుత్ సౌకర్యం సక్రమంగా లేదని స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు వేయించాలనగా.. ట్రాన్స్‌కో ఏఈ ప్రసాదరెడ్డిని పిలిచి పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజల ఇళ్ల వద్దకే సంక్షేమ పథకాలు అందుతుండటాన్ని జీర్ణించుకోలేక టీడీపీ నాయకులు అభివృద్ధి పథకాలను అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు.

**వైఎస్సార్‌సీపీలోకి చేరిన టీడీపీ నాయకులు..**
వర్షం జోరుగా కురిసినప్పటికీ కార్యక్రమాన్ని ఆపకుండా కొనసాగించారు. ఈ క్రమంలో ఎస్సీ కాలనీకి చెందిన టీడీపీ నాయకులు మాదుగుల స్టాలిన్, సామేల్, ప్రసాద్, రాజు ఆధ్వర్యంలో 25 మంది కుటుంబాలు ఎమ్మెల్యే శిల్పా సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎంపీపీ దేరెడ్డి చిన్నసంజీవరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ బారెడ్డి శ్రీనివాసరెడ్డి, ప్రధాన కార్యదర్శి పుల్లారెడ్డి, మాజీ ఎంపీపీ దేసు వెంకటరామిరెడ్డి, సర్పంచ్ జ్ఞానభరణం, కుమార బాబు, శ్రీకాంత్, నాగరాజు, సురేష్, బిజ్జం వెంకటేశ్వరరెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి, నాగరాజు, శ్రీరాంరెడ్డి, బిజ్జం చెన్నారెడ్డి పాల్గొన్నారు.

### గరుడ వాహనంపై విహరించిన పాండురంగడు

కోవెలకుంట్ల: పట్టణంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సహిత పాండురంగ విఠలేశ్వరుడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం గరుడ వాహనంపై స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాలచార్యులు, సుదర్శనాచార్యులు పంచామృతాభిషేకం, మహాగణపతి పూజ, స్త్రీసూక్త, భూసూక్త విధానేన అభిషేకాలు, సంప్రోక్షణ తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రికి పాండురంగడు ప్రత్యేక అలంకరణంలో గరుడవాహనంపై భక్తులకు కనువిందు చేశారు. పట్టణంలోని వివిధ కాలనీలకు చెందిన భక్తులు స్వామివారికి పూజలు నిర్వహించారు. గరుడసేవను పురస్కరించుని ఆలయ ఆవరణలో ఒంగోలు కళాకారులచే నిర్వహించిన ఆర్కెస్ట్రా అలరించింది. సోమవారం గజేంద్రవాహనంతో స్వామివారి వాహన సేవలు ముగియనున్నట్లు ఆలయ ధర్మకర్త రాంభూపాల్‌రెడ్డి పేర్కొన్నారు.

# కనుల పండువగా ప్రతిష్ఠోత్సవాలు




వేంకటేశ్వరస్వామి మూలవిరాట్‌ను ప్రతిష్ఠించిన దృశ్యం, ఎమ్మెల్యే శిల్పాను సత్కరిస్తున్న కమిటీ సభ్యులు

వెలుగోడు: పట్టణంలో నూతనంగా నిర్మించిన శ్రీ లక్ష్మీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఉత్సవ మూర్తులు కొలువు దీరారు. ఈనెల 3వ తేదీ నుంచి విశేష పూజలు అందుకున్న వేంకటేశ్వర స్వామి భూదేవి, శ్రీదేవి, ద్వారపాలకులు, ఆళ్వార్లు, ధ్వజ స్తంభం, బలిపీఠం, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, ఆంజనేయస్వామి వారి విగ్రహాల ప్రతిష్ఠను ఆదివారం కనుల పండువగా నిర్వహించారు. ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి, దాతల సహకారంతో ఆలయ కమిటీ ఏడేళ్ల పాటు శ్రమించి పట్టణంలో శ్రీలక్ష్మీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి నూతన ఆలయాన్ని నిర్మించారు. ఆలయ ప్రారంభం, విగ్రహాల ప్రతిష్ఠ సందర్భంగా పీఠాధిపతులు నిత్యానంద భారతి స్వామి, మేడా సుబ్రహ్మణ్యస్వామి, స్థానిక పురోహితులు బ్రహ్మశ్రీ గోపాలకృష్ణశర్మ పూజలు నిర్వహించి వేదమంత్రోచ్చారణల మధ్య శాస్త్రోక్తంగా నూతన విగ్రహాలను ప్రతిష్ఠించారు. మండలం నుంచే కాకుండా చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు.

**ఎమ్మెల్యేకు ఘన సత్కారం..**
శ్రీలక్ష్మీప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి సహకరించిన శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పాచక్రపాణి రెడ్డిని ఆలయ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ప్రతిష్ఠ మహోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే చక్రపాణిరెడ్డి, శిల్పాభువనేశ్వరరెడ్డికి పురోహితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి స్వామి వారి చిత్రపటం, తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. ఆలయ కమిటీ చైర్మన్ బళ్లాని వెంకట సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఇలియాస్‌ఖాన్, ఎంపీపీ లాలం రమేష్, ముంతల విజయభాస్కరరెడ్డి, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.



వేడుకల్లో పాల్గొన్న భక్తులు

# ముంచిన వాన..

- వరుసగా కురుస్తున్న భారీ వర్షాలు
- చేతికొచ్చిన వరి, మొక్కజొన్న,మినుము పంటలు వర్షార్పణం
- 80 ఎకరాల్లో దెబ్బతిన్న పంటలు




నేలమట్టమైన మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న దృశ్యం, మొలకెత్తిన మొక్కజొన్న కండెలు

జూపాడుబంగ్లా: అకాల వర్షాల ధాటికి మండలంలోని తాటిపాడు, 80బన్నూరు, తరిగోపుల, పి.లింగాపురం, తర్తూరు, మండ్లెం, తదితర గ్రామాల్లో 80 ఎకరాల్లో మొక్కజొన్న, వరి, మినుము తదితర పంటలు దెబ్బతిన్నాయి. చేతికొచ్చిన పంటలు మరో రెండు మూడు రోజుల్లో నూర్పిడి చేసుకొందామనుకుంటున్న తరుణంలో వరుసగా కురిసిన భారీ వర్షాల కారణంగా మొక్కజొన్న పంట నేలమట్టమైంది. వర్షంలో తడిసిన మొక్కజొన్న కండెల్లోని విత్తనాలు మొలకలు రావటంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు రోజుల నుంచి ఆర్బీకేల సిబ్బంది వారి పరిధిలోని పంటలను పరిశీలించి పంట నష్టపోయిన రైతుల వివరాలు సేకరిస్తున్నారు. శనివారం తాటిపాడు గ్రామానికి చెందిన వీఏఏ అబ్దుల్లా తాటిపాడు, 35బొల్లవరం పొలిమేరల్లోని పొలాలను పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. వీటితో పాటు ఉద్యానవన పంటలు కూడా దెబ్బతిన్నాయని రైతులు పేర్కొంటున్నారు. మండల వ్యవసాయ అధికారి కృష్ణారెడ్డి మాట్లాడుతూ మండలం వ్యాప్తంగా 20 హెక్టార్లలో మాత్రమే మొక్కజొన్న, వరి, మినుము పంటలు దెబ్బతిన్నట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. రెండు రోజుల్లో పంటలు నష్టపోయిన రైతుల వివరాలను సమగ్రంగా సేకరించి జిల్లా కలెక్టర్‌కు నివేదిస్తామని చెప్పారు. పంటనష్టం వాటిల్లిన రైతులు ఆర్బీకే సిబ్బందిని పొలానికి పిలుచుకొని వెళ్లి పంట నష్టం వివరాలు నమోదు చేయించుకోవాలని సూచించారు.